క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: సులానగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నాయకుడు కోరం సురేందర్ నాయకత్వంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్, సులానగర్ పంచాయతీ సొసైటీ డైరెక్టర్ కుమ్మరి లావణ్య, లాకావత్ లింబ్యా, గురువయ్యలతో పాటు మొత్తం 71 కుటుంబాలు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కోరం కనకయ్య పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భూక్యా దేవా, ఉదయ్, లక్కినేని శ్యాం శివలాల్, రెడ్యానాయక్, అజ్మీర శివ, బుజ్జి, ఈది గణేష్, నర్సయ్య, సీహెచ్ శేఖర్, పోశాలు, భద్రు, రవి, సర్దార్, మధురెడ్డి, మంగీలాల్,ప్రసాద్, శంకర్, శ్రీను, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ కమిటీ ఎన్నిక



బాలాజీ నాయక్



మోహన్ నాయక్

టేకులపల్లి: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సంఘం కమిటీని ఎన్నుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్‌గా టేకులపల్లి మండలానికి చెందిన సునావత్ బాలాజీ నాయక్, కోకన్వీనర్‌గా గుగులోత్ మోహన్ నాయక్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు నాయక్ నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ... తమపై నమ్మకంతో పదవులు ఇచ్చినందుకు ఎల్‌హెచ్‌పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తేజావత్ బెల్లయ్య నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, జాతీయ ప్రధాన కార్యదర్శి కోట్యానాయక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సక్రు నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, చందర్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ నాయక్, జాతీయ రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

పద్మశాలీ సంఘం వనమహోత్సవం



వనమహోత్సవానికి హాజరైన పద్మశాలీలు

ఇల్లెందురూరల్: పట్టణంలోని 24ఏరియాకు చెందిన పద్మశాలీ సంఘం కులస్తులు ఆదివారం మండలంలోని చెరువుకట్ట సమీపంలోని మామిడితోటలో వనమహోత్సవం నిర్వహించారు. నిత్యం వ్యాపారాలు, ఉద్యోగం, వ్యక్తిగత పనులతో బిజీగా గడుపుతున్న పద్మశాలీలు పిల్లాపాపలతో వనమహోత్సవానికి వచ్చి ఆనందంగా గడిపారు. చిన్నారులు, యువకులు పలు సినీగీతాలకు స్టెప్పులు వేసి మురిసిపోయారు.

తహసీల్‌కు మరమ్మతులు



తహసీల్దార్ కార్యాలయంలో మట్టి పోయించి చదును చేయిస్తున్న శ్యాంబాబు

టేకులపల్లి: టేకులపల్లి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన నాగభవానీ కార్యాలయానికి పలు చేర్పులు, మార్పులతో మరమ్మతులు చేయిస్తున్నారు. ప్రధాన రహదారి వైపు ఉన్న ప్రవేశ ద్వారాన్ని పక్క రోడ్డుకు మార్చారు. మార్చిన వైపు ఆవరణంలో మురుగు నీటిగుంతలు ఉండటంతో స్పందించిన బేతంపూడి సొసైటీ డైరెక్టర్ లక్కినేని శ్యాంబాబు తన సొంత ఖర్చులతో ఆదివారం ఓసీ నుంచి మొరం పోయించి చదును చేయించారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: గొడవ పడుతుంటే వారించడానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం... మండల పరిధి రాజాపురం గ్రామంలో కిరాణం దుకాణం వద్ద ఈనెల 16వ తేదీ అర్ధరాత్రి ఆటోలో వచ్చిన ముగ్గురు గొడవ చేస్తుంటే అదే గ్రామానికి చెందిన కోరేం మధు అడ్డు చెప్పడానికి వెళ్లగా అతనిపై రెడ్డిగూడెం గ్రామానికి చెందిన నల్లబోతు కోమరవెల్లి కూల్ డ్రింక్ బ్రీతో దాడిచేయగా గాయాలయ్యాయని బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

నత్తనడకన వైద్య కళాశాల నిర్మాణం

రూ.147 కోట్ల ప్రాజెక్టు
- నర్సింగ్ కాలేజీలో వైద్య కళాశాల నిర్వహణ
- మెడికోలకు దూరంగా హాస్టల్
- ఇబ్బందుల్లో వైద్య విద్యార్థులు





నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని వైద్య కళాశాల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి..ఈ కళాశాల నిర్మాణం పనులు ప్రారంభమైన నాటి నుంచి ఆగుతూ సాగుతున్నాయి. నిధులలేమి కారణంగా నిర్మాణ పనులు ఆలస్యం అవుతున్నాయి. కేసీఎం కళాశాల పక్కన జరుగుతున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులకు రూ.147 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 9 భవనాల నిర్మాణం చేపడుతున్నారు. వైద్యకళాశాల నిర్వహణ భవనం జీ+2, వైద్య విద్యార్థినుల హాస్టల్ జీ+4, వైద్య విద్యార్థినుల ఇంటర్ పిష్ జీ+4, వసతి గృహం జీ+5, వసతి గృహం జీ+4, వైద్య విద్యార్థుల ఇంటర్నల్ జీ+4, విద్యార్థుల వసతి గృహం, జీ+4, అతిథి గృహం జీ+2 , కిచెన్, డైనింగ్ గౌండ్ ఫ్లోర్ భవనాల నిర్మాణం చేపడుతున్నారు. జనవరి 2023లో వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అదే సంవత్సరంలో ఆరు నెలల పాటు పనులు నిలిచిపోయాయి. అయిన పనులను బిల్లులు రాకపోవడం వల్ల కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. ఇప్పుడు మళ్లీ పనులు ప్రారంభమయ్యాయి. కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ 9 భవనాలు స్లాబ్ లెవల్ వరకు పూర్తయ్యాయి. 50 శాతం వరకు నిర్మాణ పనులు జరిగాయి. ఇప్పటి వరకు సుమారు రూ.70 కోట్ల పనులు జరిగినట్లు తెలిసింది. బిల్లులు చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయటం వల్ల నిర్మాణ పనులు నత్తనడకగానే సాగుతున్నాయని సమాచారం.

నర్సింగ్ కళాశాలలోనే వైద్య కళాశాల...

కేఎస్ఎం కళాశాల పక్కన కేటాయించిన స్థలంలో నర్సింగ్ కళాశాలలో 2022లో వైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి అదే భవనంలో వైద్య కళాశాల కొనసాగుతోంది. ప్రస్తుతం మూడు సంవత్సరాల 450 మంది వైద్య విద్యార్థులు చదువుకుంటున్నారు.

ఈ భవనంలో రెండే క్లాస్ రూమ్‌లు ఉండటంతో వైద్య విద్యార్థులకు బోధన ఇబ్బందిగా ఉంది. ఈ కళాశాల ఆవరణలో వసతి గృహాలు లేకపోవటం వల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇందులో వైద్య విద్యార్థినులకు పాల్వంచలో కిరాయి వసతి గృహం ఏర్పాటు చేశారు. వైద్య విద్యార్థులకు మంచికంటి నగర్‌లో కిరాయికి మూడు భవనాల్లో వసతి కల్పించారు. కొత్తగూడెంలోని నలంద కళాశాల వద్ద రెండు వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో వాష్ రూమ్ సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతి గృహలకు నెలకు రూ.3 లక్షల కిరాయి చెల్లిస్తున్నారు. 2022 నుంచి ఇప్పటి వరకు వసతి గృహాలకు ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తోంది. వైద్య కళాశాలకు వసతి గృహాలు దూరం కావటంలో వైద్య విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వైద్య కళాశాల నుంచి టిపిన్, లంచ్, డిన్నర్ చేయాల్సి వచ్చినా, నవభారత్, పాల్వంచ, కొత్తగూడెం రావాల్సిందే. వైద్య కళాశాల ఆవరణలో ఉన్న క్యాంటిన్‌లో ఫుడ్ సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



వైద్య కళాశాల భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. వసతి గృహాలు ఏప్రిల్ నెల వరకు సంబంధిత కాంట్రాక్టు పూర్తి చేసి ఇస్తామన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయితే, వైద్య విద్యార్థులకు ఇబ్బందులు ఉండవు.
– రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీలో చోటు

సింగరేణి(కొత్తగూడెం): సుమారు పదేళ్ల తరువాత కొత్తగూడెం ఏరియాలో ఐఎన్‌టీయూసీ జెండా ఎగురవేయటానికి కృషి చేసిన నాయకులకు సెంట్రల్ కమిటీలో యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి అవకాశం కల్పించారని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. ఆదివారం రుద్రంపూర్‌లో సెంట్రల్ కమిటీలో స్థానం పొందిన నాయకులు రజాక్‌ను ఘనంగా సన్మానించారు. సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బూటుక రాజేశ్వరరావు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మల్లారపు కొమరయ్య, జేవీఆర్ ఓసీ నుంచి పోశం శ్రీనివాస్, ఎం.అశోక్‌లకు పదవులు దక్కాయని, ఇందుకు సహకరించిన యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్‌లకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిలక రాజయ్య, పోశం శ్రీను, బూటుక రాజేశ్వరరావు, మల్లారపు కొమరయ్య, సకినాల సమ్మయ్య, చెనిగరపు కుమార్, రామ్‌శంకర్, చిట్టిబాబు, ప్రభాకర్, రూపేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం..



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, ఎస్పీ రోహిత్‌రాజ్, అధికారులు

కొత్తగూడెంటౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం సమష్టిగా కృషి చేద్దామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎస్పీ రోహిత్‌రాజు హాజరై వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ... అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ట్రాఫిక్ సమస్యలను, పార్కింగ్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కొత్తగూడెంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి ముఖ్య ప్రదేశాలలో ట్రాఫిక్ సిగ్నల్స్, నిరంతర పనితీరు, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి వివరించారు. అదేవిధంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయంతో నివారణ చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ.. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలపై అవగాహన ఉండాలని, పోలీసులకు సహకరించాలని చెప్పారు. కొత్తగూడెం పట్టణ వ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు సమకూరుస్తామన్నారు. వ్యాపారస్తులు, ఆటోడ్రైవర్లు, పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసుల సూచనలను పాటించాలని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు ట్రాఫిక్ నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ ఆర్టీఓ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, ఎంవీఐ సంగం వెంకటపుల్లయ్య పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలపై సమీక్ష సమావేశం

ఇల్లెందు: 26న గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జీఎం వి.కృష్ణయ్య కోరారు. ఆదివారం ఇల్లెందులోని తన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రన్స్ అండ్ గోల్స్ స్టేడియం 24 ఏరియాలో నిర్వహించే ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కోరారు. జాతీయ జెండా ఆవిష్కరణ, సెక్యూరిటీచే వందన సమర్పణ, ఉత్తమ ఉద్యోగులకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, ఏరియా రక్షణ అధికారి రామస్వామి, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, అధికారులు నాగరాజు నాయక్, కృష్ణమోహన్, వెంకటేశం, ధనుంజరెడ్డి, దిలీప్‌కుమార్, అంజిరెడ్డి, రామదాసు, మధుబాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం కృష్ణయ్య

చెమట చుక్కలకు తర్ఫీదు..

వాల్మీకి గ్రూప్, సింగరేణి ఆధ్వర్యంలో రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల, నిర్వాసిత పిల్లలకు విదేశీ విద్యావకాశాలు, వృత్తి పురోగతి శిక్షణ కార్యక్రమం ఉంటుందని జీఎం తెలిపారు. వృత్తి, విదేశీ విద్య అవకాశాల కోసం చెమట చుక్కలకు తర్ఫీదు అనే కార్యక్రమం ద్వారా ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 27 నుంచి అవగాహన కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు.

రేపటి నుంచి వార్డు సభలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డుల్లో ఈనెల 21వ తేదీ నుంచి వార్డు సభలు జరుగనున్నాయని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా కొరకు దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు వార్డు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు వార్డు సభలకు హాజరు కావాలని కోరారు.

గురుకులంలో అడ్మిషన్లు

పాల్వంచ: స్థానిక కేఎస్‌పీ రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ గురుకుల ఇంటర్ కళాశాల (కొత్తగూడెం గర్ల్స్)లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బిపాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియంలో ముస్లిం, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు పరిమిత సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9550472464, 8919403948 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చిన్నచూపు తగదు..



వీరూనాయక్, నరసింహారావు

జూలూరుపాడు: చిన్న పత్రికలు, యూట్యూబ్ న్యూస్ చానల్స్‌పై ప్రభుత్వం, అధికారులు చిన్న చూపు తగదని ఆ సంఘం మండల అధ్యక్షుడు భూక్యా వీరునాయక్ అన్నారు. ఆదివారం జూలూరుపాడులో చిన్న పత్రికలు, యూట్యూబ్ చానల్స్ విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిన్న పత్రికలు (పీడీఎఫ్), యూట్యూబ్ చానల్స్ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా బి.వీరు నాయక్, ఉపాధ్యక్షుడిగా కంచపోగు నరసింహారావు, కార్యదర్శిగా రమేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గోపి నాయుడు, బూరం రమేష్, భూక్యా శంకర్, చాపలమడుగు నరసింహారావు, ఎస్కే యూసఫ్ పాషా, భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల జిల్లా మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకన్న

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలో సోమవారం జరగనున్న ఆటో మోటారు వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) డ్రైవర్ల జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, టేకులపల్లి ఏరియా కార్యదర్శి జర్పుల సుందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం కేటీసీలో బాడీ లారీల యార్డులో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ... ఆటో మోటార్ జీపు, క్యాబ్, టాటా మ్యాజిక్ డ్రైవర్ల కనీస వేతనాలు చట్టబద్ధ హక్కుల కోసం జిల్లా ప్రథమ మహాసభలో చర్చించి, భవిష్యత్ పోరాట కర్తవ్యాలను రూపొందించడం జరుగుతుందని తెలిపారు. ఈ జనరల్ బాడీలో నాగభూషణం, అనిల్, శ్రీను, రాములు, నరేష్, వెంకటేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు .

అర్హుల ఎంపికకు గ్రామసభలు

ఇల్లెందురూరల్: సంక్షేమ పథకాల అర్హుల ఎంపికకు మంగళవారం మూడు రోజులపాటు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధన్‌సింగ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీ, రెవెన్యూ, వ్యవసాయ, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారని చెప్పారు. సోమవారంతో సర్వే ప్రక్రియ నూరు శాతం పూర్తి చేస్తామని చెప్పారు. 21న లచ్చగూడెం, మామిడిగుండాల, ధనియాలపాడు, తిలక్‌నగర్, విజయలక్ష్మీనగర్, సీఎస్పీబస్తీ, మస్సివాగు, ముత్తారపుకట్ట, బోయితండా, రొంపేడు, మిట్టపల్లి, మొండితోగు, 22న పూబెల్లి, సుదిమళ్ల, బాలాజీనగర్, ఇందిరానగర్, సుభాష్‌నగర్, మర్రిగూడెం, పోలారం, మామిడిగూడెం, రేపల్లెవాడ, చల్లసముద్రం, ఒడ్డుగూడెం 23న బొజ్జాయిగూడెం, మాణిక్యారం, రాఘబోయినగూడెం, పోచారంతండా, కొమరారం, కొమ్ముగూడెం గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే గ్రామసభలకు ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పేదలకే 'సంక్షేమం' అందాలి



మాట్లాడుతున్న నరసింహారావు

జూలూరుపాడు: పేదలకే సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు అన్నారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... ఈనెల 26 నుంచి అమలు పరుచనున్న నాలుగు సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతీ ఒక్కరికి మంజూరు చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలను పక్కకు పెట్టి ఆ పార్టీ నాయకులకే ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అధికారులు గ్రామసభలు నిర్వహించి నిజమైన పేదలకు సంక్షేమ పథకాలు అందించేటప్పుడు ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవకాశం కల్పించరాదన్నారు. సంక్షేమ పథకాల విషయంలో పేదలకు అన్యాయం జరిగే వారి పక్షాన బీఎస్పీ పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో గార్లపాటి సైదులు, జి.కిరణ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

పాల్వంచరూరల్: కల్లాల్లో, కొనుగోలు కేంద్రంలో నిల్వ చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దంతలబోర ఎస్సీ కాలనీ పంచాయతీలో రైతులు ధాన్యం పంటపొలాల్లో, కొనుగోలు కేంద్రంలో రాశులు పోశారు. కొనుగోలు కేంద్రంలో జీసీసీ నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ధాన్యం కొనుగోలు నిర్వాహకుడు ప్రభాకర్‌ను వివరణ కోరగా... లారీ లోడుకు సరిపడా ధాన్యం లేక కొనుగోలులో జాప్యం జరుగుతోందని, ట్రాక్టర్‌ను మాట్లాడి కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ఇల్లెందురూరల్: కొమరారం హైస్కూల్‌లో 2008–09లో పదో తరగతి చదివిన విద్యార్థులు పదిహేనేళ్ల తరువాత ఆదివారం పాఠశాల ఆవరణలో సమావేశమయ్యారు. నాడు పాఠశాలలో గడిచిన తీపి జ్ఞాపకాలతో సరదాగా గడిపారు. ఒకరికొకరు యోగక్షేమాలను, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. నాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. సిరిపురం వినోద్, రాజ్‌కుమార్, సురేష్, సల్మాన్, సద్దాం, దేవేందర్, మాధవి, ప్రత్యూష పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో మానసిక, శారీరక దృఢత్వం

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థుల శారీరక దృఢత్వానికి, మానసిక పురోగతి ఎన్‌సీసీ (నేషనల్ క్రేడిట్ కార్ప్స్) ఎంతో ఉపయోగపడుతుందని సింగరేణి ఎడ్యుకేషన్ సెక్రటరీ గుండా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆనందఖని ప్రభుత్వ పాఠశాలలో ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 11వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌కే.భద్రాతో ఆయన చర్చించారు. అనంతరం క్యాడెట్‌లతో సంభాషించారు. మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్రాభివృద్ధిపై కమాండింగ్ ఆఫీసర్ చూపుతున్న శ్రద్ధ అభినందనీయం అన్నారు. ఈ పరీక్షలో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు సింగరేణి పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు పాల్గొని పరీక్ష రాస్తున్నట్లు కమాండింగ్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఉపాధ్యాయురాలు, ఎస్.శ్రీలత, ప్రశాంత్, రాజసింహా, రాజుగౌడ్, డి.ఫూల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లతో మాట్లాడుతున్న శ్రీనివాస్


ఎస్సీ వర్గీకరణ న్యాయమైంది..



ఉపేందర్

సింగరేణి(కొత్తగూడెం): ఎస్సీ వర్గీకరణ న్యాయమైందని, ఎమ్మార్పీఎస్‌కు సీఎల్‌సీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని పౌరహక్కుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్షుడు ఎస్.ఉపేందర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ (ఏబీసీడీ)లకు ఉమ్మడి జిల్లా కమిటీ కూడా తమ సంపూర్ణ మద్దతు నిస్తుందన్నారు. ఇటీవల ఎస్సీ వర్గీకరణ అంశం వివాదస్పదంగా మారటం శోచనీయమన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు అవకాశవాదంతో రెండు నాలుకల ధోరణి వల్ల మరింత వివాదాస్పదం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదానికి కారణమైన పాలకుల వైఖరిని ఎండగట్టటం కోసం ఆయా సంస్థలు సంయమనం పాటించాలని కోరారు. అసెంబ్లీ చట్టబద్ధత తీసుకరావాలిస్న అవసరం కాంగ్రెస్‌పై ఉందన్నారు.

నేడు లెనిన్ శత వర్ధంతి సభ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ ప్రచార పోస్టర్లను ఆదివారం మండలంలోని కొమరారం గ్రామ గ్రంథాలయ సెంటర్‌లో మాస్‌లైన్ నేతలు ఆవిష్కరించారు. అజ్మీర బిచ్చా మాట్లాడుతూ.. జనవరి 21 నాటికి మార్కిస్టు మహోపాధ్యాయులలో ఒకరైన లెనిన్ అమరుడై వంద సంవత్సరాలు అని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా లెనిన్ రచనలు అధ్యయనం చేయాలని, సభలు, సమావేశాలు నిర్వహించి విప్లవోద్యమంలో ఆయన కృషిని ప్రజలకు తెలియచేయాలని మాస్‌లైన్ నిర్ణయించిందన్నారు. ముగింపు సభలో మరింత సమగ్రంగా వివరించేందుకు పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో వాంకుడోత్ శంకర్, ముత్తమ్మ, యమున, సత్యం శాంతారావు, రమేష్, తిరుపతి, మహేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

దంపుడు బియ్యంతోనే భోజనం..

ఆధునిక కంప్యూటర్ యుగం వచ్చినా ఏజెన్సీలో గిరిజనులు టెక్నాలజీని అందిపుచ్చుకోలేని పరిస్థితి. వడ్లను మిల్లులో పట్టిస్తే క్షణంలో బియ్యం వస్తాయి. కానీ నేటికీ ఆదివాసీలు వడ్లను రోకలితో దంచుకుని బియ్యాన్ని తింటున్నారు. ఈ విషయంలో ఆది నుంచి గిరిజనుల్లో మార్పు రాలేదు. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం దంతలబోరు గ్రామ పంచాయతీలోని ఎర్రబోరు, ఉల్వనూరు బంజర గ్రామపంచాయతీ చిరుతానిపాడు, పెద్దకలిస, రేగులగూడెం పంచాయతీలోని రాళ్లచెలక గ్రామాల్లో ఆదివాసీ గిరిజనులు నిత్యం ధాన్యాన్ని ఇంట్లోనే దంచుకుని బియ్యం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వాళ్లకు ధాన్యాన్ని పట్టే వడ్లమిల్లులు అంటే కూడా తెలవకపోవడం అతిశయోక్తి కాదు. అంతేకాకుండా వడ్లను దంచుకుని ఎప్పటికప్పుడు తినడం వలన బలంగా ఉంటామని, రోజంతా పనిచేయగలుగుతామని గిరిజనుల నమ్మకం.

– పాల్వంచరూరల్



చిరుతానిపాడులో వడ్లను దంచుతున్న గిరిజన మహిళ